ప్రజాశక్తి

సోమవారం 27 నవంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

జగనన్నా... మా గోడు వినలేదన్నా!

- కోడూరులో 22ఎ భూ సమస్యల పరిష్కారానికి వినతి
- 60 రోజుల కాలపరిమితి ముగిసినా అపరిష్కృతం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిమూటలవుతున్నాయి. కీలకమైన భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. సెప్టెంబర్ 15వ తేదీన కోడూరు మండలంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 22ఎ-1 సబ్ సెక్షన్ (ఎ), (బి)ల్లోని రైతులు భూములను నిషేదిత జాబితా నుంచి విడుదల చేయాలని కోరుతూ బాధితులు చేసిన ఫిర్యాదులకు గడువు ముగిసినా పరిష్కరించలేదు. తమ భూములకు అన్ని ఆధారాలను (దస్తావేజులు, ఎన్‌కంబరెన్స్) సమర్పించినా దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోడూరు మండలంలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్‌ఫోటో)

కోడూరు మండలంలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 22ఎలో చేర్చిన తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ రైతులు వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రంతో పాటు కొందరు తమకు (మిగతా 6లో)



అర్జీ రశీదు

Sri Y S Jagan Mohan Reddy
Hon'ble Chief Minister Of Andhra Pradesh

Mandal Grievance Day-Krishna

Your Spandana Request No. (YSR#)	KRI202309151595	అర్జీ నమోదు తేది	15-09-2023
అర్జీ విభాగము	Revenue (Ccla)-->Sec.22 (A)->Sec 22(A) Of Registration -Act T 908 Deletion From The Prohibit List Orders Requested-Reg		
పేరు	REPALLE YOGA PRAKASH	ఫోను	9440649423
జిల్లా	Krishna	మండలము	Koduru
గ్రామ సచివాలయము	KODURU1-(R), 10690240	ప్రస్తుత నివాసం	5-168, 5-168, KODURU1-(R), 10690240, Koduru, Krishna
పరిష్కరించు అధికారి	COLLECTOR & DISTRICT MAGISTRATE, KRISHNA		
గడువు	60 Day(s)	పరిష్కరించు గడువు తేది	14-11-2023
ఎన్రోల్మెంట్ ఆపరేటర్	10690240-Ps,KODURU1,Koduru,Krishna		

గమనిక! మీ యొక్క ఫిర్యాదు స్థితి కొరకు 1902 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోను చేసి YSR# చెప్పగలరు.

Scan QR for Receipt

అర్జీదారులకు ఇచ్చిన రశీదు

అంతా సిద్ధం

48 గంటల మహాధర్నాకు తరలివస్తున్న కార్మిక, కర్షకులు

కార్మిక, కర్షక డిమాండ్ల సాధనకు కార్మిక సంఘాల ఐక్యవేదిక, రైతు సంఘాల సమన్వయ సమితి ఈ నెల 27, 28 తేదీల్లో చేపట్టిన మహాధర్నాకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో 48 గంటల పాటు జరిగే మహాధర్నాకు సంబంధించి ఆదివారం రాత్రికే కార్మిక, కర్షకులు విజయవాడకు తరలివచ్చారు. ఇప్పటికే మహాధర్నా జయప్రదం కోరుతూ గత నెల రోజుల నుంచి కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కార్మిక, రైతు సంఘాల నాయకులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. కరపత్రాల పంపిణీ, బైక్ ర్యాలీలు, జనరల్‌బాడీ సమావేశాలు నిర్వహించారు. కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే దేశానికి భవిష్యత్తు ఉంటుందని ప్రజలకు వివరించారు.

జింఖానా గ్రౌండ్స్‌లో సిద్ధమైన సభా వేదిక, మహాధర్నాకు వైజాగ్ నుంచి తరలివచ్చిన కార్మికులు

సర్వీసు రోడ్ల విస్తరణ ప్రశ్నార్థకం

- రెండేళ్ల క్రితం బెంజిసర్కిల్ ఫ్లైఓవర్ల ప్రారంభం
- నేటికీ అందుబాటులోకి రాని సర్వీసు రోడ్లు
- నిర్మాణాలు చేపట్టాలని గతంలో హైకోర్టు ఆదేశాలు
- నేటికీ అడుగు ముందుకు పడని వైనం

ప్రజాశక్తి-విజయవాడ ప్రతినిధి

విజయవాడ నగరంలో బెంజిసర్కిల్ రెండు ఫ్లైఓవర్‌ల నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం సర్వీసు రోడ్ల విస్తరణపై ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రెండేళ్ల క్రితం ఫ్లైఓవర్‌లను ప్రారంభించినా వాటికి ఇరువైపుల ఉన్న సర్వీసు రోడ్ల నిర్మాణాల ప్రక్రియ అడుగు ముందుకు పడలేదు. రోడ్లు వేయాలని ఇది వరకే హైకోర్టు

ఆదేశాలు జారీ చేసినా కార్యరూపం దాల్చక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హైకోర్టు డైరెక్షన్స్

సర్వీసు రోడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలివ్వాలని స్థానికులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైకోర్టు బెంజి సర్కిల్ ఫ్లైఓవర్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఎఐ)ను 2019లో ఆదేశించింది. బెంజ్ సర్కిల్ ఫ్లై ఓవర్లకు ఇరువైపులా కనీసం 7.5 మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్లు నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ (మిగతా 6లో)

లెనిన్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

మోడీ గో బ్యాక్...

రాష్ట్రానికి చేసిన ద్రోహంపై విద్యార్థి, యువజన సంఘాల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ: ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ తిరుపతి పర్యటనను వ్యతిరేకిస్తూ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఆదివారం నిరసన తెలిపారు. నల్లబెలూన్లు ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ రాష్ట్రానికి అన్ని రకాలుగా ద్రోహం చేసిన ప్రధాని మోడీ ఏ ముఖం పెట్టుకొని తిరుపతి పర్యటనకు వస్తున్నారని ప్రశ్నించారు. ఈ పర్యటనను (మిగతా 6లో)

వేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు

- రూ.95 కోట్ల మేర బిల్లుల చెల్లింపులు
- పంచాయతీరాజ్ శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఇ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సచివాలయాలు, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎన్‌టిఆర్ జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఇ అక్కినేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పలు భవనాల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లాలో చేపట్టిన భవన నిర్మాణాల స్థితిగతులపై వెంకటేశ్వరరావు 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లాలో సచివాలయ భవనాలు, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్లు, ఆర్‌బికెల నిర్మాణాల టార్గెట్ ఎన్ని?

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా 238 సచివాలయ భవనాలు, 114 హెల్త్

సెంటర్ భవనాలు, మరో 141 ఆర్‌బికెలు నిర్మించాల్సి ఉంది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని నిర్మాణాలు పూర్తి అయ్యాయి?

16 మండలాల పరిధిలో 145 సచివాలయ భవనాలు, 57 వైఎస్ఆర్ హెల్త్ సెంటర్లు, మరో 89 ఆర్‌బికెల భవనాలు పూర్తి అయ్యాయి.

ప్రశ్న: ఒక్కొక్క భవన నిర్మాణానికి ఖర్చు ఎంత?

రూ.43.6 లక్షలు ఒక్కొక్క సచివాలయానికి, అలాగే రూ. 20.8 లక్షల మేర వైఎస్ఆర్ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి, రూ.23.94 లక్షల ఆర్‌బికె

నిర్మాణానికి నిధుల కేటాయింపు జరిగింది.

ప్రశ్న: ఈ భవనాల నిర్మాణాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? ఎప్పటి లోపు పూర్తి చేయాలి? ఏ నిధుల నుంచి వెచ్చిస్తున్నారు?

2021లో ఈ భవనాల నిర్మాణాలను ప్రారంభించగా, వచ్చే డిశంబర్ (మిగతా 6లో)

లేఅవుట్ సందర్శన

లే అవుట్‌ను పరిశీలిస్తున ఎంపిపి, తదితరులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు గ్రామ జగనన్న కాలనీ లేఔట్‌ను ఇంజనీరింగ్ అసిస్టెంట్, తుమ్మలపాలెం గ్రామం వైసిపి నాయకులు రాము, ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్ పరిశీలించారు. గత కొన్నాళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపే దిశగా తమ అడుగులు వేస్తున్నామని అధికారులందరూ తమకు సహకరించాలని వచ్చేవారం వ్యవధిలో గుంటుపల్లి, తుమ్మలపాలెం మరియు జూపూడి గ్రామాల లేఔట్ నందు అభివద్ధి పనులు ప్రారంభమవుతాయని సంబంధిత అధికారులందరు అందుబాటులో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో, ఎమ్మార్వోలకు కలుస్తామని పాలడుగు జ్యోత్స్న తెలియజేశారు.

దీపోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని మేడూరు గ్రామంలో విలసిల్లుతున్న వివిధ ఆధ్యాత్మిక ఆలయాలను మైలవరం ఏసిపి రమేష్ పర్యవేక్షించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం స్థానికంగా ఉన్న శ్రీ కాత్యాయని సమేత జీవన్ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం, వీరాంజనేయ దేవస్థానం ప్రాంగణాల్లో వైభవంగా, జరుగుతున్న దీపోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. దాదాపు 10వేల మందికి పైగా రానున్న యాత్రికుల సౌకర్యార్థం ప్రాంగణా సౌకర్యాలు సరిపడతాయా? లేదా? అన్నది నేరుగా పర్యవేక్షించి, పరిశీలించారు. కొన్ని కొన్ని పరిస్థితులను ఆలయ కమిటీలతో చర్చించి, సూచించారు. రాత్రి మహాన్నదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గంపలగూడెం ఎస్సై పి రాంబాబు,సిబ్బంది,యాత్రికులు పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట

ప్రజాశక్తి - గంపలగూడెం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు కిటకిటలాడారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాల్లో వేలాది దీపాలు వెలిగించడంతో కొత్త కళ వచ్చింది. మేడూరులో ఉన్న శ్రీ కాత్యాయని సమేత జీవన్ముక్తేశ్వర స్వామి దేవస్థానం, గంపలగూడెం, నెమలి, కొనిజర్ల, పెనుగలను, కొత్తపల్లి, గోసవీడు గ్రామాల్లో గల శివాలయాల్లో దీపోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తిరుపతమ్మకు దీపాలంకరణ

విరాళమిస్తున్న దాతలు

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : కార్తీకమాసం సందర్భంగా ఆదివారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయంలోని శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతామూర్తుల దీపాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కర్నూలు జిల్లా శ్రీశైలంకు చెందిన వెంకట శేషగిరిరావు, ఉమామహేశ్వరి దంపతుల సౌజన్యంతో అమ్మవారిని, స్వామి వారిని, దీపాలంకరణను తీర్చిదిద్దారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి యాత్రికులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డిప్యూటి కలెక్టర్ కె.రమేష్ నాయుడు సూచన మేరకు గ్రామానికి చెందిన శ్రీ విష్ణు హార్డ్ వేర్ ఎలక్ట్రికల్ దుకాణం యజమాని మోహనరావు,టంకాధేవి దంపతులు శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయ వెండి తాపడం నిర్మాణానికి రూ.55 వేలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

'టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలో 13వ వార్డు రంగస్వామి బజారులో బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాతయ్య ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పతకాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకష్ణ, షేక్ బాషా, పున్న ఉపేంద్ర, పున్న లక్ష్మి, పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రతిజ్ఞ చేయిస్తున్న విఎంసి కమిషనర్ పుండ్కర్

అంబేద్కర్ చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న కలెక్టర్ డిల్లీరావు, పక్కన

ప్రజాశక్తి - విజయవాడ : భారతరత్న డా. బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం అందించడం ద్వారా భారతదేశానికి దశ, దిశ చూపించారని, ఆయన ఆశయాల స్ఫూర్తితో యువత అడుగులు వేసి తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడంతోపాటు జిల్లా, రాష్ట్రం, దేశాభివద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పిలుపునిచ్చారు. నవంబర్ 26వ తేదీ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలెక్టర్ డిల్లీరావు.. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమున్నత రాజ్యాంగం అందించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ బాధ్యతా యుతంగా మెలుగుతూ రాష్ట్ర, దేశాభివద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా విఎంసి అధికారులతో కలిసి నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ కమిషనర్ (జనరల్) కే.శకుంతల మాట్లాడారు. ఈ వేడుకల్లో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కే. సత్యవతి వియంసి మేనేజర్ బి శ్రీనివాస్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం ఘనంగా జరిగింది. సి.పి.ఒ. ఏ.ఓ. టి.రంగారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది, సి.పి.ఓ. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది, సి.పి.ఓ. అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులను పాటించాలని ఎంఎల్ఎ విష్ణు సూచించారు. బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాతృసంస్థ సమతా సైనిక్ దళ్ (ఎస్ఎస్‌డి) ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నివాళు లర్పించారు. **తిరువూరు :** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని తిరువూరునగర పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. **ఇబ్రహీంపట్నం :** నిమ్రా విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైన నారాయణమూర్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. **రెడ్డిగూడెం :** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం విజయవాడ, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వ్యాసరచన పోటీలు విజేతలకు తహశీల్దార్ ఎం.పాల్, నెహ్రూ యువ కేంద్రం ఎన్టీఆర్ జిల్లా యూత్ ఆఫీసర్ రాముతో కలిసి సర్టిఫికెట్, బహుమతులు ప్రదానం చేశారు. వైసిపి, టిడిపి ఆధ్వర్యంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. **నందిగామ :** నందిగామ వైసిపి కార్యాలయంలో ఎంఎల్ఎ డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **జగ్గయ్యపేట:** మండలంలోని షేర్ మహమ్మద్ పేట ఎస్సీ కాలనీలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోట కృష్ణ, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దంతాల వెంకటేశ్వర్లు, గ్రామ పెద్ద ముల్లంగి సాదు, కెవిపిఎస్ నాయకులు జుజ్జువరపు వెంకటరావు పాల్గొన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైం స్టోన్ మైన్స్ విస్సి టౌన్షిప్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామచందర్ నాయక్, సెక్రటరీ డి.విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, కాంట్రాక్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు. సాయిబాబా గుడి వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకరరావు ఆధ్వర్యంలో కౌన్సిలర్ సుందరమ్మ, శామ్యూల్, వెంకయ్య, భాస్కరావు, చంద్రమౌలి, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలైనా అద్దె చెల్లించాల్సిందే

ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ రజా

మాట్లాడుతున్న అల్తాఫ్ రజా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి ఇఎస్ఐ హాస్పిటల్ మున్సిపాలిటీ ఆస్తి అని దానికి మున్సిపాలిటీకి అద్దె చెల్లించాలని ఆదివారం పత్రికల్లో మున్సిపల్ కమిషనర్ చెప్పడాన్ని ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ రజా తీవ్ర అభ్యంతరకరమని అన్నారు. సర్వే నెంబర్ 433 లోగల 11 ఎకరాల 25 సెంట్లు విలువైన భూమి ఆంధ్రప్రదేశ్ గజిట్ 1962 జూన్ 26 సీరియల్ నెంబర్ 762 ప్రకారం వక్ఫ్‌బోర్డ్ ఆస్తిగా ఉంది. ఈ భూమిలో ప్రభుత్వం సచివాలయం–4, ఇఎస్ఐ హాస్పిటల్, ఆయుర్వేద హాస్పిటల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. నేడు అది మున్సిపాలిటీ ఆస్తిగా చెప్పుకుంటూ ఇఎస్ఐ హాస్పటల్‌కు మున్సిపాలిటీ అద్దె వసూలు చేస్తాం అని మున్సిపల్ కమిషనర్ చెప్పడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అన్నారు. మైలవరం నియోజవర్గ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఈ విషయంలో జోక్యం చేసుకొని ముస్లిం మైనార్టీలకు సంబంధించిన వక్ఫ్‌బోర్డ్ ఆస్తులు కాపాడాలని కోరారు. వక్ఫ్‌బోర్డ్ భూమిలో అక్రమంగా నిర్మాణం చేసిన ఇఎస్ఐ హాస్పిటల్, ఆయుర్వేద హాస్పిటల్, సచివాలయం 4 భవనాలకు సంబంధించి వక్ఫ్‌బోర్డుకు అద్దె చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉన్నత న్యాయస్థానం హైకోర్టులో న్యాయం కోసం పోరాడతామని అల్తాఫ్ రజా హెచ్చరించారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని వ్యక్తి మృతి

మృతిచెందిన విశ్వేశ్వరరావు (ఇన్‌సెట్‌లో) మృతుని పాతచిత్రం

ప్రజాశక్తి - కంచికచర్ల : ఆర్టీసీ బస్ ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం కంచికచర్లలో జరిగింది. కంచికచర్లకు చెందిన గంగూరు విశ్వేశ్వరరావు (39) అయ్యప్ప మాలలో ఉన్నాడు. ఆదివారం సాయంత్రం పేరకలపాడు అడ్డరోడ్డు నుండి కంచికచర్లలో ఇంటికి నడిచి వస్తున్నాడు. కంచికచర్ల సమీపంలో చెరువు కట్ట వద్ద జాతీయ రహదారి దాటుతుండగా జగ్గయ్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కంచికచర్ల వైపు వస్తుండగా రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో విశ్వేశ్వరరావు అక్కడికక్కడే మతిచెందాడు. కేవలం రెండు నిమిషాల్లో ఇంటికి వెళ్ళాల్సిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందటంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతునికి భార్యా, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నా జయప్రదం చేయాలి

నందిగామలో రైతు సంఘం ఆధ్వర్యంలో పుస్తకాలు ఆవిష్కరణ చేస్తున్న రైతు, కౌలు రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - నందిగామ : నవంబర్ 27,28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘం పుస్తకాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు సిఐటియు కార్యదర్శి కె.గోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సయ్యద్ ఖాసిం మాట్లాడారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు, అన్ని రాష్ట్రాల్లోని రాజ్‌భవన్‌ల ముందు నిరసనలు జయప్రదం చేయాలని కోరారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యర్రా శ్రీను, సిఐటియు నాయకులు కరి వెంకటేశ్వరరావు, ప్రతిపాటి శ్రీను పాల్గొన్నారు.

బిసిల ద్రోహి సిఎం జగన్ : టిడిపి

వన్‌టౌన్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎస్ బేగ్, నందిగామలో సౌమ్య

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బీసీల ద్రోహి సీఎం జగన్ మోహన్ రెడ్డి అని టిడిపి నాయకులు ఎంఎస్.బేగ్ మండిపడ్డారు. ఆదివారం పశ్చిమ టిడిపి కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బిసిలపై జరుగుతున్న దాడులపై పుస్తకం విడుదల చేశారు. అనంతరం మీడియాతో ఎంఎస్.బేగ్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి, బీసీలను అణగదొక్కే విధంగా ఆలోచన చేస్తూ ముఖ్యంగా బీసీ నాయకులు కొల్లు రవీంద్ర, అచ్చంనాయుడు, అయ్యన్నపాత్రుడు, చింతకాయల విజయ్ మీద, తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించి సంతోషపడటం చూసామన్నారు. జగన్మోహన్ రెడ్డి 56 కులాలకు కార్పొరేషన్లు పెట్టి ఏ ఒక్క కులానికి ఏ కార్పొరేషన్‌కి ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బూర కనకరావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుడెల రమణ, ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధి బెవర సాయి సుధాకర్, పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నందం భవాని ప్రసాద్, పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత, తదితరులు పాల్గొన్నారు. **నందిగామ :** బీసీల నమ్మక ద్రోహి జగన్ అని నందిగామ, మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య విమర్శించారు. నందిగామ పట్టణంలోని కాకానినగర్ మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య కార్యాలయంలో ఆదివారం టిడిపి బీసీ సెల్ నేతలతో కలిసి బీసీల ద్రోహి జగన్ రెడ్డి అంటూ పుస్తకాన్ని మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ నాయకులు వీరంకి వీరాస్వామి, పలులువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు

మచిలీపట్నంలో...

అవనిగడ్డలో...

గుడివాడలో...

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడమే అంబేద్కర్ కు ఇచ్చే నిజమైన ఘనమైన నివాళి అని కెవిపిఎస్ కష్ణా జిల్లా అధ్యక్షులు సిహెచ్. రాజేష్ అన్నారు. దేశానికి పునాదిగా ఉన్న రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరుతూ ఆదివారం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మగ్గాల కాలనీలో కెవిపిఎస్ మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా డాక్టర్. బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని కులవ్యవస్థ భారతదేశంలో ఉందని, ఈ వ్యవస్థ పోవాలని అంబేద్కర్ కోరుకున్నారన్నారు.అంబేద్కర్ జపం చేస్తున్న మనువాద మతోన్మాదులు కులవ్యవస్థ ను ప్రోత్సాహిస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కులం పేరుతో దుర్మార్గాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొడాలి శర్మ మాట్లాడుతూ ఉన్న చట్టాలు కాపాడటంలో పాలకులు విఫలమయ్యారని, కులవ్యవస్థ కు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ నగర అధ్యక్షులు మిరియాల ఆనంద్ బెనర్జీ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారిబూర. సుబ్రహ్మణ్యం, సిఐటియు మండల కార్యదర్శిచిరువోలు జయరావు, ఎల్ఐసి యూనియన్ డివిజన్ సహాయ కార్యదర్శి టి. చంద్రపాల్, కెవిపిఎస్ నాయకులు కె. బాబురావు, రేమల్లి బాబు శరత్, దమ్ము కేశవరావు, కల్లు భాను తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు భారత రాజ్యాంగాన్ని ప్రత్యేక సబ్జెక్టుగా పాఠ్యాంశాలలో చేర్చాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి కోటయ్య పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొత్త మాజేరు లోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని చట్టాలను, హక్కులను, విధులను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. నేతలు మేడేపల్లి సుబ్బారావు ,మద్దాల వెంకటేశ్వరరావు,మండే ఆనంద్,కాకి నవీన్,గుంటూరు ప్రశాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** స్థానిక వైఎస్ ఆర్ సీపీ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జెడ్పిటీసి సభ్యులు ఏ ఇ.రాణీ, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు పొలిమెట్ల జయరాజు మాట్లాడుతూ దేశ ప్రజలందరికి న్యాయం, స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతత్వాలను అందిస్తూ రూపొందించబడిన భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదించినబడిన సందర్భంగా ఈరోజు దేశ ప్రజలు అందరూ రాజ్యాంగ దినోత్సవం జరుపుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్ ఆర్ సీపీ మండలపార్టీ అధ్యక్షులు నీలం బాలు, వైఎస్ ఆర్ సీపీ మాజీ అధ్యక్షులు పడమటి సురేష్, చింతల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.అలాగే గొల్లన పల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు కే.ఎస్.జగదీశ్వరరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినులు వెంట్రప్రగడ రాణి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీవో దారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పంచా యతీ కార్యాలయం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పంచా యతీ కార్యదర్శి ఏజెల్ నరసింహారావు, పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పెదపారుపూడి :** పెదపారుపూడి మండల తహసీల్దార్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. తాసిల్దార్ కార్యాలయం సూపర్నెంట్ వాణి, గుడివాడ రెవిన్యూ డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు చాట్ల అజయ్ కుమార్, వీఆర్వో ఏ ఎస్ ఆర్ కె ప్రసాద్ పాల్గొన్నారు .**ప్రజాశక్తి - గుడివాడ:** ప్రపంచ ప్రజాస్వామ్య రాజ్యాంగాలను అధ్యయనం చేసి మేలురకం ప్రజాస్వామిక వ్యవస్థను రూపొందించడంలో అంబేద్కర్ కషి అనన్య సామాన్యమైనదని కష్ణాజిల్లా ఆదిమాన సంఘం అధ్యక్షుడు పొంగులేటి జయరాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక గౌరీశంకరపురంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ భవనంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు విల్సన్ బాబు, సభ్యులు మెండా కిరణ్ కుమార్, బెజ్జం సువర్ణరాజు పాల్గొన్నారు. అలాగే గుడివాడ టిడిపి కార్యాలయంలో రూరల్ మండల అధ్యక్షుడు వి మురళి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టిడిపి నాయకులు పులవర్తి డేవిడ్, పోలాసి ఉమా, పిల్లా సాల్మన్ పాల్గొన్నారు.అలాగే స్థానిక శరత్ థియేటర్ లోని వైసీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా నాయకులు వెంపటి సైమన్, బెజ్జం సువర్ణరాజ్, మెండా కిరణ్ కుమార్, మామిళ్ళ ఎలీషా పాల్గొన్నారు.అలాగే గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ వి మురళీకష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఇంజనీర్ పి విజయదుర్గ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గూడూరు :** గూడూరు మండల పార్టీ అధ్యక్షులు పర్ణం పెదబాబు ఆధ్వర్యంలో స్థానిక వైస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు సంగా మధుసూధనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డా.బి ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. గూడూరు సర్పంచ్ లింగం విజయకుమార్, చిట్టిగూడూరు సర్పంచ్ లంక సుబ్రహ్మణ్యం, రామరాజు పాలెం సర్పంచ్ పరసా రాజులు,సి హెచ్ సి డైరెక్టర్ బత్తిన నాగ త్రినాధ్ పాల్గొన్నారు. అలాగే పెడన వైయస్సార్ సీపీ కార్యాలయం, తోట మూల బైపాస్ రోడ్డు విగ్రహాల నందు వైఎస్ఆర్సిపి టౌన్ ప్రెసిడెంట్ బండారు మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముత్యాల మురళి, యువజన నాయకులు కటకం నాగకుమార్, కోడూరు శ్రీను పాల్గొన్నారు. **ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ :** భారత రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఎంపీపీ నగేష్,రాష్ట్ర నాటక రంగా డైరెక్టర్ నక్క గాంధీ అన్నారు.భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాపులపాడు మండలం ఎం.జి నగర్, ఎంపీడీవో కార్యాలయం వద్ద దళిత నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే బాపులపాడు పంచాయతీలో గ్రామ సర్పంచ్ కమలాకిరణ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ కోమరవల్లి గంగ భవాని, సర్పంచ్ కమలాకిరణ్, పి.ఎస్.ఎస్ అధ్యక్షుడు దయ్యాల విజయ నాయుడు,వైఎస్ఆర్సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్ మూర్తి, వైస్సార్సీపీ జిల్లా కార్యదర్శ వెలగపల్లి ప్రదీప్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సీతయ లంక వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగం ఆవశ్యకతను వివరించారు. గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా, పరిషత్ ఉపాధ్యక్షులు ది డ్ల కిరణ్, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు **ప్రజాశక్తి-ఉంగుటూరు :** మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వీ సరోజినీ పాల్గొని మాట్లాడారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఉంగుటూరు సర్పంచి కే వరప్రసాద్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్‌సిసితో విద్యార్థుల్లో జాతీయభావం

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయభావం పెంపొందించేందుకు నేషనల్ కేడెట్ కార్ప్ (ఎన్సీసీ) ఎంతగానో ఉపయోగ పడుతుందని లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ నూకల సాంబశివరావు అన్నారు. ఎన్సీసీ డే పురస్కరించుకుని ఏజీఅండ్ ఎస్ జీఎస్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ ఎన్సీసీ విభాగం, లయన్స్ క్లబ్ అధ్వర్యంలో కళాశాల గ్రౌండ్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా జాతీయ పతాకం ఎగురవేయగా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఎన్సీసీ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా ఎన్సీసీ కేడెట్ల విన్యాసాలు అబ్బుర పరిచాయి. ఎన్సీసీ దినోత్సవ విశిష్టత తెలియజేస్తూ కేడెట్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కళాశా ప్రిన్సిపాల్ శ్రీరాం, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్కుమార్, ఎన్సీసీ ఆఫీసర్లు పి.శ్రీరాంతేజ, జీవీ రమణ పాల్గొన్నారు.

తెంపల్లిలో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం తెంపల్లి గ్రామంలో రోడ్డు ముంపు సమస్యకు పరిష్కారం లభించింది. పంచాయతీ కార్యాలయం నుండి యాదవుల పేట మీదగా నండూరి పార్థసారథి ఇంటి వరకు నూతనంగా రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. వర్షం పడితే చెరువుగా మారుతోంది. ఈ క్రమంలో పంచాయతీ సర్పంచ్ కొలుసు శిరీష ప్రత్యేక దష్టిసారించి గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయించారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి :మండల పరిధిలోని పురిటిగడ్డ సీఎస్ఐ చర్చిలో జరిగిన సెమి క్రిస్మస్ వేడుకల్లో ఎస్ఐ సిహెచ్.చినబాబు పాల్గొని మాట్లాడారు. సాటివారిపట్ల ప్రేమ ,దయ,క్షమాగుణం కలిగి ఉండాలనే బైబిల్ సారాంశం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని తెలిపారు. చర్చిలో చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు దేవరపల్లి సురేష్ బాబు,శ్రీరామా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు :మండలంలోని కనకవల్లి గ్రామంలో ఆదివారం నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.తమకు వచ్చిన సమాచారం మేరకు కనకవల్లి గ్రామంలో పొలాలలో పేకాడుతున్న వారిని పట్టుకుని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలను, రూ.3220 సొమ్మును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

దేవరకోట సంబరంలో హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల హెడ్ కానిస్టేబుల్ పై దాడి జరిగిన సంఘటన ఆదివారం రాత్రి దేవరకోట గ్రామంలో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు దేవరకోట గ్రామంలో ఐదేళ్లకు ఒకసారి జరిగే కోట ముత్యాలమ్మ సంబర కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి గ్రామస్తులు సంబరం నిర్వహించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి సంబరం వద్ద గస్తి నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పద్మారావు సంబరం సమయం ముగిసిందని చెప్పగా, మద్యం సేవించిన కొందరు ఆయనపై దాడి చేశారు. ఈ దాడిలో పద్మారావు తల పగిలి గాయం కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. హుటాహుటిన చల్లపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి ఆయనను తీసుకువెళ్లి చికిత్స అందించారు. అనంతరం తల స్కానింగ్ నిమిత్తం మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాని ఎస్ఐ కుడిపూడి శ్రీనివాస్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - గుడివాడ : పరోపకారం పరమార్థం అనే సూక్తితో శుభంకర మానవ మహోదయ క్షేత్రం వ్యవస్థాపకులు రామిశెట్టి మురళి నేతత్వంలో ఆయన కుమారుడు, కుమార్తె రామిశెట్టి రాయుడు, షీతల్ వితరణతో క్యాన్సర్ రోగి పోతుల కాంతారావుకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, పాలంకి సారథిలు అన్నారు. ఆదివారం స్థానిక పెద్ద ఎరికపాడులోని రామిశెట్టి మురళి స్వగహంలో రామిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు జ్ఞాపకార్థం (అన్నా, చెల్లెలు) రాయుడు, షీతల్ వితరణతో క్యాన్సర్ రోగి పోతుల కాంతారావుకు ఆర్థిక సహాయాన్ని జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, పాలంకి సారథిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం క్యాన్సర్ రోగులకు కూడా నెల నెల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ కరీం, ముత్యాల రాంబాబు, పెద్ద ఎరికపాడు వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గన్నవరం : రవి న్యూరో సెంటర్ విజయవాడ వారి ఆధ్వర్యంలో సూరంపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. మెదడు, వెన్నెముక, నరములు, తలనొప్పి, ఫిట్స్, పక్షవాతం, బి.పి., షుగర్, థైరాయిడ్, జ్వరము (డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా), జలుబు, దగ్గు, మహిళలలో రక్త హీనత, మొదలగు వైద్య సేవలు అందించారు. డాక్టర్ పసుమర్తి రవి, డాక్టర్ పి. సూర్యతేజ, డాక్టర్ పి. భాస్కర్ ప్రకాష్ తదితరులు పాల్గొని రోగులను పరీక్షించారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రజా వ్యతిరేకంగా విధానాలు అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి ప్రసాద్ అన్నారు. ఆదివారం గన్నవరం సిపిఐ కార్యాలయంలో గన్నవరం నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం పెద్దు వెంకటరత్నం అధ్యక్షతనజరిగింది.ఈ సమావేశంనికి. రాష్ట రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి ప్రసాద్ (రాష్ట కార్యవర్గ సభ్యులు నార్ల వెంకటేస్వశరవు,జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, ముఖ్యాతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రైతాంగానికి మోడీ తీవ్రంగా నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. రైతు లు కార్మికులు సాధించుకున్న చట్టాల ను రద్దు చేసి దొడ్డి దారిన నల్లలచట్టలు తీసుకోచారు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో.కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, రైతు నాయకులు ముక్కమాల ఉమామహేశ్వరవు, కాట్రగడ్డ రామచంద్ర జోషి,శనగల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి రోజా

మంత్రి రోజాకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఇంజనీర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్ర కీలాద్రి దుర్గమ్మను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆదివారం శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ కెవిఎస్ కోటేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుర్గమ్మ దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ వారు అమ్మవారి ప్రసాదం, వస్త్రం అందజేశారు.

దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన యాత్రికులు

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి ఆదివారం కావటంతో భక్తులు విశేషంగా తరలివచ్చారు. భవానీ మండల దీక్షా ధారణలో నాల్గో రోజు సందర్భంగా పలువురు యాత్రికులు దుర్గమ్మను దర్శించుకొని దీక్షలు స్వీకరించారు. కార్తీక మాసం సందర్భంగా దేవస్థానంలో ఉదయం 9 గంటల నుండి మ 12 గంటల వరకు సహస్రలింగార్చన సేవ నిర్వహించారు.

ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు (పక్కన) పగిలిన బుద్ధుడి విగ్రహం

పవిత్ర సంగమంలో బుద్ధుడు విగ్రహాన్ని నిర్మించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీం పట్నంలోని పవిత్ర సంగమంలో తక్షణమే మున్సిపల్ అధికారులు బుద్ధుడు విగ్రహం పున:నిర్మాణం చేపట్టాలని, పగుల గొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం కొండపల్లి టౌన్ కమిటీ కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. పవిత్ర సంగమం వద్ద ప్రతిష్ట భద్రత చర్యలు చేపట్టాలని, పర్యాటక కేంద్రంగా అభివద్ధి చేయాలని, సంగమంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారని వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, సంగమం వద్ద మెట్లు దిగేటప్పుడు భద్రత చర్యలో భాగంగా గ్రిల్స్ ఏర్పాటు చేస్తామని మున్సిపల్ అధికారులు, బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారని నేటికీ నీటి మూటలుగానే మిగిలిపోయిందని భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పవిత్ర సంగమం పరిశుభ్రత కోసం గతంలో 15 మంది వర్కర్స్ మొక్కలు, పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా పని చేసే వారని వీరిని తక్షణమే డ్యూటీలోకి తీసుకుని సంగమం పరిరక్షణ అభివద్ధి కోసం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఇబ్రహీంపట్నం మండల కమిటీ సభ్యులు బి.రామసీత, బి.కష్ణరాయలు, సిఐటియు మండల నాయకులు వేముల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు వాహబ్‌కు సన్మానం

వాహబ్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్, బేగ్ తదితరులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంకు చెందిన సీనియర్ టిడిపి నాయకులు అబ్దుల్ వాహబ్‌ను 41వ డివిజన్‌లో ఉన్న వాహబ్ స్వగహానికి ఆదివారం వెళ్లిన విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్, టిడిపి జిల్లా అధ్యక్షులు నెట్టెం రఘురాం, టిడిపి నాయకులు ఎం.ఎస్ బేగ్ సత్కరించారు. అక్రమ కేసులో అరెస్టు అయిన దేశం అధినేత చంద్రబాబు విడుదలైన సందర్భంగా వాహబ్ ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి సారేపల్లి రాధాకష్ణ, డివిజన్ 41వ అధ్యక్షులు షేక్ సుభాని, 55వ డివిజన్ వడ్డాది రమణ, 38వ డివిజన్ సురభి బాలు, 40వ డివిజన్ అధ్యక్షులు పి.చిన్నసుబ్బయ్య, 43వ డివిజన్ అధ్యక్షులు దూది బ్రాహ్మయ్య, క్లస్టర్ ఇంచార్జిలు సయ్యద్ కరీముల్లా, ఆలుగండ్ల సుబ్బారెడ్డి, యేదుపాటి రామయ్య, షేక్ హబీబుల్లా, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ముసుగులో డ్రామాలు : వెలంపల్లి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చందాల కోసం ఆర్యవైశ్యుల ముసుగులో రాజకీయ డ్రామాలాడతారా, ఆర్యవైశ్య సంఘాల ముసుగులో నన్ను ఇబ్బంది పెట్టాలని కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం బ్రాహ్మణ వీధిలో గల తన కార్యాలయంలో వెలంపల్లి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ సామూహిక సత్యనారాయణ వ్రతాలకు పోలీసులు అడిగిన వివరాలు ఇవ్వలేదని, కార్తీక పౌర్ణమి స్నానాల కోసం వేలాది మంది భక్తులు వచ్చే చోట వారికి ఇబ్బంది కలిగేలా కార్యక్రమం తలపెట్టారని అన్నారు. ఆర్య వైశ్యులకు నేనేమి చేశానో చర్చకు సిద్ధంగా ఉన్నానని, టీడీపీ ఆఫీస్‌కు రమ్మన్నా కూడా నేను సిద్ధమేనని సవాల్ చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ హిందూ ద్రోహులని మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఆలయాలు కూల్చివేస్తే బీజేపీ పట్టించుకోలేదన్నారు. పోతిన మహేష్ సిగ్గు లేకుండా చంద్రబాబుకి చంచాగిరి చేస్తున్నాడన్నారు. చంద్రబాబు ఎప్పుడూ ఆర్య వైశ్యులకు ప్రాధాన్యత ఇవ్వలేదని, జగన్ సీఎం అయ్యాక అనేక రాజకీయ, నామినేటెడ్ పదవులిచ్చారని అన్నారు. చింతామణి నాటకం జీవో రద్దు, వాసవి దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించింది సిఎం జగన్ అని అన్నారు.

వనసమారాధనకు అనుమతులివ్వించాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : తన సామాజిక వర్గమైన ఆర్యవైశ్యులపై పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా మూడో తేదీన కార్తీక వనసమరాధనకు తమకు అనుమతిప్పించాలని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నాయకులు వివికె.నరసింహారావు డిమాండ్ చేశారు. ఈ నెల 26న తాము ఏర్పాటు చేసిన వనసమారాధనకు వెలంపల్లి శ్రీనివాసరావు అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని కార్యక్రమాన్ని అడ్డుకున్నారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఇతర ఆర్యవైశ్య నాయకులతో కలిసి వీవీకే నరసింహారావు మీడియాతో మాట్లాడారు. ఆర్యవైశ్యుల వనసమరాధనకు అడ్డం తగిలిన వెలంపల్లి దీనిలో చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌లను తీసుకురావటం అంటే కార్యక్రమాన్ని ఆయనే అడ్డుకున్నారన్నది ఒప్పుకున్నట్లేనన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు, కొణిజేటి రమేష్

అధికారులు అడిగిన అంశాలకు తాము సమాధానం చెప్పలేదని, కార్యక్రమాన్ని అడ్డుకోవాల్సిన అవసరం తనకు లేదని ఆయన చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘ నేతలు నూకల నాగేశ్వరరావు, డూండీ రాకేష్, దర్శి వాసు, కొనిజేటి రమేష్ పాల్గొన్నారు.

కెబిఎన్‌లో ఎన్‌సిసి దినోత్సవం

వన్‌టౌన్‌లో నమూనాలను ప్రదర్శనను తిలకిస్తున్న నారాయణరావు

నందిగామలో విజేతలైన ఎన్‌సిసి క్యాడెట్లకు బహుమతులు అందజేస్తున్న దశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎన్‌సిసి శిక్షణ పొందటం ద్వారా క్రమశిక్షణాయుత జీవితాన్ని అనుసరించేందుకు అవకాశముంటుందని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వీ.నారాయణరావు మాట్లాడుతూ దేశభక్తి భావాలను పెంపొందించుకుంటూ విద్యార్థులు తమను తాము ఉత్తమంగా ఆవిష్కరించుకునేందుకు ఎన్‌సీసీ ముఖ్యభూమికను పోషిస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ కేపీటీ విజయభాస్కర్ మాట్లాడుతూ తమ కళాశాలలో సుదీర్ఘ కాలంగా ఎన్‌సీసీ విభాగం విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దటానికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు నమూనాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సాంస్కృతికాంశాలను ్ర ప్రదర్శించారు. **నందిగామ :** ఎన్‌సిసి క్యాడెట్లు దేశభక్తితో పాటు సమాజసేవకు అంకితం కావాలని నందిగామ కెవిఆర్ కాలేజి ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం.స్వామి పేర్కొన్నారు. ఆదివారం నందిగామ కెవి.ఆర్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సిసి డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లు దేశభక్తి, ఏకత్వం, క్రమశిక్షణ గురించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. డ్రిల్, డ్రాయింగ్, క్విజ్ పోటీలలో విజేతలైన క్యాడెట్లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రతి సంవత్సరం నవంబర్ చివరి ఆదివారం ఎన్‌సిసి డే జరుపుకోవడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి ఆఫీసర్ లెఫ్ట్ నెంట్ డా. పులి రజనీకాంత్, పిజికల్ డైరెక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొనగా ఎన్‌సిసి క్యాడెట్లు హాజరయ్యాయి.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి వత్సవాయి: జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మండలంలోని లింగాల గ్రామంలో ఆదివారం విజయవాడ డాక్టర్ ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యుల బందం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎన్నిసార్లు వేర్వేరు ట్రస్టుల వారు ఎన్ని క్యాంపులు నిర్వహించినా ఇంతటి విశేష స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది అని అన్నారు. సుమారుగా 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 300 మంది కళ్ళజోళ్ళు, 105 మందికి ఆపరేషన్ అవసరం కాగా వారికి గురువారం కళ్ళ జోళ్ళు ఇచ్చి, ఆపరేషన్ అవసరమైన వారిని విజయవాడ ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్తామని జయప్రద ఫౌండేషన్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - వత్సవాయి : ఇందుగుపల్లి గ్రామానికి విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్ (నాని) ఎంపి నిధులతో మంచినీటి సరఫరా ట్యాంక్‌ను అందించారు. సోమవారం జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామంలో జరగనున్న బ్రహ్మంగారి కళ్యాణం, అన్నదానం కార్యక్రమాలకు తాగునీటికి ట్యాంకర్‌ను పంపాల్సి ఉండటంతో ఆదివారం ఈ ట్యాంకును గ్రామ సర్పంచ్ మొల కృష్ణారావు, ఎంపీటీసీ చావా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు.

నీటి ట్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

దీపాలతో పరమేశ్వరుని చిత్రం



ప్రజాశక్తి - జగ్గయ్యపేట: కార్తీక పౌర్ణమి పండగ సందర్భంగా పరమేశ్వరుని చిత్రపటాన్ని చాట్ పేపర్‌పై జగ్గయ్యపేట పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ కార్తీక దీపాల వరుసలతో చిత్రీకరించారు.

పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జనసేనాని పవన్ కళ్యాణ్ బీసీల పక్షపాతి అని జనసేన నగర అధ్యక్షులు పోతిన మహేష్ కొనియాడారు. ఇంటింటికి రాబోయే జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 60వ రోజు ఆదివారం 56వ డివిజన్ సమన్వయకర్తలు దాసిన జగదీష్, నోచర్ల పవన్ కళ్యాణ్, షాహినా ఆధ్వర్యంలో ఆర్ఆర్ పేటలో పర్యటిస్తూ ప్రజలను కలుస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విశాఖపట్నంలో బోట్లు తగలబడిపోయిన ఘటనలో మొట్ట మొదటిగా స్పందించి బోట్లు తగలబడి పోయిన వారికి రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని పవన్ కళ్యాణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. అనంతరం మహేష్ మీడియాతో మాట్లాడుతూ టీడీపి జనసేన పొత్తు వలన కలిగే ప్రయోజనాలు మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవకి, బాబీ, లారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

అమ్మగార్డెన్స్‌లో వనసమారాధన

ప్రజాశక్తి - నందిగామ : మునేటి ఒడ్డున అమ్మ గార్డెన్స్ లో కార్తీక వన సమారాధన ఉత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. నందిగామ గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెలది సుగుణ శేఖర్‌రావు, గుడిమెట్ల పూర్ణ చంద్రమోహన్, పోలవరం సదాశివరావు, కొమరగిరి వాచస్పతిల ఆధ్వర్యంలో సంఘ నాయకులు సత్యనారాయణ స్వామి వ్రతం శివలింగ అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్ రవి, మహిళ బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రమాదేవిని కలిసిన హనుమంతరావు

రమాదేవిని కలిసిన హైకోర్టు న్యాయవాది

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవిని హైకోర్టు న్యాయవాది, ఎన్టీఆర్ జిల్లా సమన్వయ అభివద్ధి, పర్యవేక్షణ, మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎక్కిరాల హనుమంతరావు మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు, పనిచేసి టిడిపి, జనసేన సంయుక్తంగా గెలుపే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు.

మోదీ క్షమాపణలు చెప్పాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్కి ప్రత్యేక హెూదా అమలు చేస్తామని, విభజన హామీలను, పోలవరం నిధులను కేటాయిస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా హామీ ఇచ్చి 9 ఏళ్ళు అవుతున్న, హామీని అమలు చేయని నరేంద్ర మోడీ వెంకన్న సాక్షిగా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ లు చెప్పాలని సిపిఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం, సిపిఐ మచిలీపట్నం ఏరియా కార్యదర్శి లింగం ఫిలిప్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కోనేరు సెంటర్లో సిపిఐ, సిపిఎం మచిలీపట్నం నియోజకవర్గ కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్రానికి అన్యాయం చేసిన, రాష్ట్ర విభజన హామీలను అమలు చేయని భారత ప్రధాని "నరేంద్ర మోడీ గో బ్యాక్ "అంటూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 9 ఏళ్ల క్రితం నరేంద్ర మోడీ తిరుపతి వెంకన్న సాక్షిగా తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీలను అమలు చేస్తామని, ప్రత్యేక దృష్టితో చూసి గుజరాత్ కన్నా అభివృద్ధి చేస్తామని, ఆ హామీలు ఇంతవరకు అమలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. తిరుపతి వెంకన్న సాక్షిగా ఆంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, మోడీ దేవుడిని కూడా రాజకీయాల కోసం వాడుకుంటున్నరన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్కి తీరని అన్యాయం చేసిన ప్రతిపక్ష పార్టీలు ఏ ఒక్కరు బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పరిస్థితి లేదని, జనసేన నేత పవన్ కళ్యాణ్ నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి రావాలని అనటం ఈ రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ లింగం ఫిలిప్, సిపిఎం కమిటీ సభ్యులు సి హెచ్ జయరావు, సిపిఐ నాయకులు ఓ ఎల్ రావు, యూనియన్ నాయకులు పి ఏసు,దుర్గారావు, కె అంబా ప్రసాద్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ తెలిపారు.

తుమ్మలను కలిసిన ఆళ్ల గోపాలకృష్ణారావు

ప్రజాశక్తి-హనుమాన్జంక్షన్: ఖమ్మం జిల్లాలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థి,మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరావును గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని సాగునీటివి వినియోగ దారుల సంఘాల సమాఖ్య ఏపీ అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. ఆదివారం తెల్లవారజామున మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ హనుమాన్ జంక్షన్ లోని ప్రఖ్యాత అభయాంజనేయ స్వామి దేవాలయంలో తుమ్మల పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్తుపల్లిలో ప్రచార కార్యక్రమానికి విచ్చేసిన తుమ్మల నాగేశ్వరరావును స్వయంగా కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు జమ్ముల రాఘవరావు, కృష్ణాజిల్లా జిల్లా తెలుగు రైతు నాయకులు వెనిగళ్ళ జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి, దేవస్థాన కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు ఏర్పాటు పరిశీలించినట్లు తెలిపారు.

మహాధర్నా విజయవంతం కోరుతూ కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 27 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నాలు ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం గన్నవరంలో సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు పార్టీ నాయకులు సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరరావు, వీర్రాజు, కైలే ఏసుదాసు, ఆంథోనీ తదితరులు పాల్గొన్నారు. నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని, కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను నిరసించాలని నాయకులు ప్రచారం చేశారు.

కరపత్రాలు పంచుతున్న నాయకులు

టిడిపి నేతలపై అక్రమ కేసులు తగదు : కొనకళ్ల

మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుపై మాజీ మంత్రి,కొల్లు రవీంద్ర లపై జగన్ తప్పుడు మద్యం కేసు పెట్టారని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. మచిలీపట్నం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమా వేశంలో కొనకల్ల నారాయణరావు మాట్లాడుతూ ప్రివిలైజ్ ఫీజు రద్దు ఫైల్ చంద్రబాబు వద్దకు రాలేదని ,టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు ఎక్సైజ్ శాఖ చూడలేదన్నారు. ప్రివిలైజ్ ఫైల్పై చంద్రబాబు సంతకం చేయలేదని కానీ జగనాసుర కుట్రలో భాగంగానే చంద్రబాబును ఏ3గా చేర్చారన్నారు.చంద్రబాబును ఇబ్బంది పెట్టాలనే వరుస కేసులు పెడుతున్నారన్నారు. మద్యం కేసులో ప్రభుత్వం చేసేవన్నీ తప్పుడు ఆరోపణలే అని స్పష్టం చేశారు. మద్యం విధానంపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నాలుగో సమావేశంలో విధి విధానాలను రూపొందించారన్నారు.కానీ కేబినెట్లో చర్చించకుండా ప్రివిలేజ్ ఫీజును రద్దు చేశారనే ఆరోపణతో వాసుదేవరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారన్నారు. కేవలం ఓటమి భయంతోనే తప్పుడు కేసులతో ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొనకల్ల బుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, గోపు సత్యం, ఇలియాస్ పాషా, లంకే నారాయణ ప్రసాద్, కాగిత గోపాల్ రావు, లంకే శేష గిరి, బచ్చుల బోస్, బత్తిన దాస్, పీవీ ఫణి, గోకుల్ శివ, వంక వెంకటేశ్వర్ రావు, పెంట మురళి, ఇదే భాస్కర్, లంకే హరి, మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హంసలదీవి బీచ్కు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండల శివారు హంసలదీవి బీచ్ వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో అందులోనూ నేడు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా బీచ్ వద్దకు విచ్చేసి సరదాగా గడిపారు. కుటుంబ సమేతంగా స్నానాలు ఆచరించి తిరుగు ప్రయాణంలో హంసలదీవి వేణుగోపాల స్వామిని దర్శించారు. తీరం వెంబడి మెరైన్ పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.

గుడ్లవల్లేరు -ముదినేపల్లి రహదారి అధ్వానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు నుండి ముదినేపల్లి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో వాహన చోధకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరాడ గ్రామం నుండి విన్నకోట మధ్యలో భారీగా గుంతలు పడ్డాయి. వీటి కారణంగా ప్రమాదాలు జరుగుతున్నట్లు చెప్తున్నారు. నిత్యం ప్రయాణించే ఉద్యోగస్తులు, విద్యార్థులు ఆ రహదారి పై ప్రయాణం చేయ డానికి నరక వేతన పడుతున్నారు. ప్రజాప్రతి నిధులు సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్ నిర్మాణాన్ని చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

ఘనంగా జాతీయ న్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా మచిలీపట్నం న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత కూనపరెడ్డి ప్రసాదరావు (నానీ) మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ వంటి మేధావులు దేశ ప్రజలు ఏర్పాటు చేసిన వరమని అన్నారు. ప్రపంచ దేశాలలో భారత దేశ రాజ్యాంగానికి అత్యున్నత విలువలు ఉన్నాయన్నారు. అందరూ రాజ్యాంగానికి లోబడి పరిపాలన సాగించాలని. మరో సన్మాన గ్రహీత సీనియర్ న్యాయవాది కొల్లిపర రమణమూర్తి మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి న్యాయమూర్తులు న్యాయవాదులే రక్షకులని అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరిబాబు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, పుప్పాల ప్రసాదు, మాజీ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.పి. కొండయ్య, కొండపల్లి వేణుగోపాల్ రావు తదితరులు భారత రాజ్యాంగం గురించి ప్రసంగించారు.

నాగవెంకట కిషోర్కు డాక్టరేట్

ప్రజాశక్తి-ఉయ్యూరు : అడుసుమిల్లి గోపాలకృష్ణయ్య చెరకు రైతుల కళాశాల కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు వెలగపూడి నాగవెంకట కిషోరు డాక్టరేట్ లభించింది. రసాయన శాస్త్ర విభాగంలో లిక్విడ్ క్రోమాటోగ్రఫీ అండ్ మాస్ స్పెక్ట్రోగ్రఫీని ఉపయోగించడం ద్వారా సంబంధిత మలినాలు, జీవశాస్త్ర కార్యకలాపాలతో పాటు ఎంపికచేసిన ఫార్మాస్యూటికల్ డ్రగ్స్ అభివృద్ధి, ధృవీకరణ పద్దతి అనే అంశముపై ప్రొఫెసర్ జీవీ రమణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్తో నాగవెంకట కిషోర్ను సత్కరించింది. ఈసంద ర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు, సిద్ధార్థ అకాడమి ప్రధాన సలహాదారు ప్రొఫెసర్ ఎలెక్ మోహన్రావు కిషోర్ను దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీరాం, ప్రత్యేక అధికారి కె. సత్యనారాయణ, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రాయపూడికి పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స చేయించుకుని అవనిగడ్డ స్వగృహానికి వచ్చిన జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలను ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఆదివారం వేణు గోపాల్ ఇంటికి విచ్చేసిన పార్టీ రాష్ట్ర నాయకులు శివశంకర్ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రామకృష్ణ, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్ గాంధీ, ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు చౌదరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిన హరి రామ్, పండమనేని శ్రీనివాస్, పిరాటి కనుమూరి మహిళా కార్యకర్తలు నియోజకవర్గం పార్టీ కార్యకర్తలు వేణుగోపాల పరామర్శించి ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని లంకపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు మచిలీపట్నం ఎంపి బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్లు ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. ఎంపి బాలశౌరి మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాలలు, రైతు భరోసా ద్వారా రైతులకు ప్రభుత్వం సాయం చేస్తూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. ఎంఎల్ఎ అనిల్కుమార్ మాట్లాడుతూ గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ నిర్మాణాలకు కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించామన్నారు. కృష్ణాజిల్లా సహకార సంఘం అధ్యక్షుల తాతినేని పద్మావతి, లంకపల్లి గ్రామ సర్పంచ్ వేమూరి రత్నకుమారి, శ్రీరంగాపురం గ్రామ సర్పంచ్ దిమ్మెట పద్మావతి, జెడ్పిటిసి ఏనుగు వెంకటరమణకుమారి, కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎలమంచిలి గణేష్, కనుమూరి వెంకటేశ్వరరావు, కొడాలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరాలి

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు కోరారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలో ఆదివారం జిల్లా పంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమాజానికి వివిధ మార్గాల ద్వారా సేవలందించిన వ్యక్తులను సత్కరించడం జరిగింది. వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారం, భాగస్వామ్యంతో వివిధ పథకాలను అమలు చేస్తున్నాయని, ఈ పథకాల ఫలాలు చిట్టచివరి లబ్ధిదారుకు అందినప్పుడే వాటి లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరంగా ఉండకూడదనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివిధ పథకాలపై అవగాహన కల్పించి.. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ లబ్ధి పొందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పిఎం కిసాన్, వైయస్సార్ రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతోందని, పంటలకు అవసరమయ్యే పెట్టుబడి కోసం ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతోందని వివరించారు. తొలుత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకానికి సంబంధించిన స్టాల్‌ను ప్రారంభించడంతో పాటు లబ్ధిదారులకు కనెక్షన్లు అందజేశారు. కిసాన్ డ్రోన్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పోరేషన్ చైర్మన్ శివరామకృష్ణ, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిపిఓ జయచంద్ర గాంధీ, డిఎంహెచ్ఓ డాక్టర్ ఎం.సుహాసిని, డా. వైయస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ సుమన్, జడ్పిటిసి కె.సువర్ణ రాజు, ఎనికెపాడు సర్పంచ్ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

వికసిత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డిల్లీరావు

గవర్నర్‌ను కలిసిన కలెక్టర్

నవంబర్ 26వ తేదీ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం రాజ్ భవన్ లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

30న కెబిఎన్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయవాడ: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కలిపించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కలిపించాలనే దిశగా కెబిఎన్ కళాశాలలో ఈ నెల 30వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుండి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి-టెక్, ఫార్మసీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేర్లను skilluniverse.apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జాబ్‌మేళాలో వివిధ రంగాలకు సంబంధించిన 16 కంపెనీ ప్రతినిధులు పాల్గొంటున్నారని, అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు 6301990597, 97000 92606, 90326 33548లకు సంప్రదించాలని కోరారు.

నేడు కలెక్టరేట్లో స్పందన

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో సోమవారం ఉదయం పది గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 9.30 గంటలకు కార్యక్రమానికి హాజరుకావాలని పేర్కొన్నారు. డివిజన్, మండల, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిల్లోనూ అర్జీలను అందజేయవచ్చని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

సర్వీస్ రోడ్ల విస్తరణ ప్రశ్నార్థకం

హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశించింది. నాటి ప్రధాన న్యాయమూర్తి అరుప్ కుమార్ గోస్వామి, జస్టిస్ నినాల జయసూర్యలతో కూడిన ధర్మాసనం సమర్థించింది.

హెచ్‌సిని ఆశ్రయించిన స్థానికులు

నోవాటెల్ హోటల్ పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డు మొదటి ఫ్లైఓవర్ నిర్మాణం తర్వాత కుంచించుకుపోవడంతో దీనిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని భారతీ నగర్‌తో పాటు దాని సమీప కాలనీల వాసులు హైకోర్టును ఆశ్రయించారు. సర్వీస్ రోడ్డు మూసుకుపోవడంతో స్థానికులు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సర్వీసు రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాలని, నిబంధనల ప్రకారం 8 మీటర్లకు తగ్గకుండా సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయాలని నాడు సింగిల్ జడ్జి ఎన్‌హెచ్ఏఐని ఆదేశించింది. అయితే సింగిల్ బెంచ్ నిర్ణయాన్ని ఎన్‌హెచ్ఏఐ సవాల్ చేసింది. ఇదిలా ఉండగా రెండో ఫ్లైఓవర్‌కు ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ స్థానికులు అప్పట్లోనే రిట్ దాఖలు చేశారు. ఫకీర్ గూడెం జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మించేలా ఎన్‌హెచ్ఏఐని ఆదేశించాలని వారు కోర్టును అభ్యర్థించారు. రెండు అంశాలు ఒకే స్వభావంతో ఉన్నందున రెండింటిని కలిపి న్యాయస్థానం విచారించింది. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు ప్రజా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని సర్వీస్ రోడ్లు వేయాలని అభిప్రాయపడింది. ఎన్‌హెచ్ఏఐ దాఖలు చేసిన రిట్‌ను కోర్టు కొట్టివేస్తూ సర్వీస్ రోడ్లు వేయాలని ఆదేశించింది. భూసేకరణకు అయ్యే ఖర్చును ఎన్‌హెచ్ఏఐ, రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ఇరువురు చర్చలు జరిపి చర్యలు చేపట్టాలని కోర్టు పేర్కొంది.

70 కాలనీల వాసుల ఇక్కట్లు

రోడ్ల విస్తరణ పనులు మూడు నెలల్లోగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)ని హైకోర్టు ఆదేశించి దాదాపు రెండున్నర ఏళ్లు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో 70కిపైగా కాలనీల వాసులతో పాటు రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నేటికీ పూర్తి కాని సేకరణ

అయితే ఎన్‌హెచ్ఏఐ ఇంకా భూమిని సేకరించే ప్రక్రియలోనే ఉన్నట్లు సమాచారం. రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్‌తో కలిసి సర్వే పూర్తి చేసి అవసరమైన భూమిని గుర్తించింది. భూ సేకరణ, భవనాలను తొలగింపు ఇంత వరకు ప్రారంభం కాలేదు. అసలు ఎన్ని బిల్డింగ్స్‌ను తొలగించాలి, భవనాలను తొలగించినందుకు ఎంత నష్ట పరిహారం చెల్లించాలనే దానిపై ఇంత వరకు స్పష్టత లేదు. దీనిపై రోడ్లు భవనాల శాఖ నివేదికను సమర్పించాల్సి ఉందని, ఆ పని ఇంత వరకు చేపట్టలేదని సమాచారం.

జగనన్నా... మా గోడు వినలేదన్నా!

భూమిపై ఉన్న హక్కులను తెలియజేస్తూ 1929 నుంచి తమకున్న డాక్యుమెంట్లు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లను, ఈ తరహా భూములకు సంబంధించిన 13 రిట్‌పిటీషన్‌లపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్పించారు. ఈ క్రమంలోనే సమస్యకు 60 రోజుల్లో పరిష్కారం చూపుతామని అధికారులు చెప్పారు. గడువు ముగిసినా సమస్య పరిష్కారం అవ్వలేదు. ఈ భూములపై ఒక వ్యక్తిగత దరఖాస్తుకు సంబంధించి నవంబర్ 14వ తేదీన మీ సమస్య పరిష్కారం అయిందని సెల్‌నంబర్‌కు మెసేజ్ వచ్చింది. 15వ తేదీన 1902 కాల్ సెంటర్ నుంచి వచ్చిన ఫోన్‌లో అధికారులు మిమ్మల్ని సంప్రదించారా? సమస్య పరిష్కారం అయిందా అని దరఖాస్తుదారులను అడిగారు. అధికారులు మమ్మల్ని సంప్రదించలేదు.. సమస్య పరిష్కారం అవ్వలేదని దరఖాస్తుదారులు చెప్పిన వెంటనే ఫిర్యాదుదారుని సెల్ నంబర్ వచ్చిన మెస్సేజ్ డిలేట్ అయింది. సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందినా..చెందకపోయినా సచివాలయానికి వచ్చి వేలిముద్ర వేసి వెళ్ళాలని దరఖాస్తు దారులకు సచివాలయ అధికారి ఫోన్‌లో సూచించారు. ఈ నేపథ్యంలోనే మీకోసం, డయల్ యువర్ కలెక్టర్, ప్రజావాణి, స్పందన కార్యక్రమాల తరహాలోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోనూ కీలక సమస్యలు పరిష్కారం అవ్వడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిషేధిత జాబితాలో 17 వేల ఎకరాలు

స్వాతంత్ర్యానికి ముందే దివితాలూకా పులిగడ్డ అక్విడేట్ వద్ద బ్రిటీష్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసింది. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు ఏర్పడకముందే ఈ ప్రాంతంలో వరి పంట సాగయింది. ప్రపంచ యుద్ధాల్లో బ్రిటీష్ తరుపున పాల్గొన్న మాజీ సైనికులకు, బ్రిటీష్ ప్రభుత్వంలో సర్వీసు చేసిన వారికి వేలాది ఎకరాలను బ్రిటీష్ ప్రభుత్వం ఈ ప్రాంతంలో కేటాయించింది. వందలాది ఎకరాల భూమిని వేలంలో విక్రయించింది. కాలక్రమంలో ఈ భూములన్నీ చేతులుమారాయి. రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2016లో ఈ తరహా భూములు 17 వేల ఎకరాలను క్షేత్రస్థాయిలో ఎటువంటి పరిశీలన చేయకుండా. స్వాధీనంలో ఉన్న భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితా (22ఏ-1)లో చేర్చారు. ఈ భూముల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందడం లేదు. అత్యవసరం అయినా అమ్ముకోవడానికి వీలులేకుండా పోయింది. స్థానిక, మండల రెవెన్యూ అధికారులు సమస్య పరిష్కరించని పరిస్థితుల్లో డివిజన్, జిల్లా స్థాయి అధికారులు భూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. వీరెవ్వరూ ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది.

మోడీ గో బ్యాక్

తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రంలోని మోడీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రశ్నించకుండా లొంగిపోవడం దారుణమన్నారు. రాష్ట్ర హక్కుల కోసం పోరాడేందుకు రాజకీయాలకతీతంగా రాజకీయపక్షాలు, విద్యార్థి, యువజన, అన్ని సంఘాలు కలిసిరావాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయి మాట్లాడుతూ విద్య కాషాయీకరణ చేస్తూ, నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్న కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలపై ఉద్యమించాలని కోరారు. విశాఖ స్టీల్ వంటి ప్రభుత్వ రంగాలను కారుచౌకగా విక్రయిస్తూ దేశానికి మోడీ అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.కృష్ణ, సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్, నాయకులు ఎస్ నోవిత్ కృష్ణ, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

వేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు

చివరి నాటికి దాదాపుగా పూర్తి చేయాల్సి ఉంది. ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో వీటి నిర్మాణాలుజరుగుతున్నాయి. హెల్త్ సెంటర్ల నిర్మాణానికయ్యే వ్యయంలో రూ.12.05 లక్షల రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ నుంచి కేటాయింపు జరుగుతుంది.

ప్రశ్న: ఇప్పటి వరకు చెల్లింపులు ఎంత మేరకు జరిగాయి?

రూ.58.49 కోట్ల మేర సచివాలయ భవన నిర్మాణాలకు, రూ. 14.61 కోట్ల హెల్త్ సెంటర్లు, రూ.22.25 కోట్ల మేర ఆర్‌బికె భవన నిర్మాణాలకు చెల్లింపులు జరిగాయి. ఆయా భవనాలకు నేటికీ మొత్తంగా రూ. 95 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. ఇంకా పెండింగ్ బిల్లులు కేవలం కోటి వరకు ఉండవచ్చు.

ప్రశ్న: స్థలాభావం వల్ల నిలిచిపోయిన భవన నిర్మాణాలెన్ని?

జిల్లాలో స్థలాభావం వలన నాలుగు సచివాలయాలు, ఏడు హెల్త్ సెంటర్లు, మరో ఎనిమిది ఆర్‌బికెలు మొత్తం 19 భవనాలు నిలిచిపోయాయి.

ప్రశ్న: ఆన్‌గోయింగ్ (ప్రోగ్రెస్)లో ఎన్ని భవనాలున్నాయి?

83 సచివాలయాలు, 57 హెల్త్ సెంటర్లు, మరో 52 ఆర్‌బికెలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

ప్రశ్న: గడపగడపకు మన ప్రభుత్వం (జిజిఎంపి) కార్యక్రమం కింద ఎన్ని వర్క్స్ చేపట్టారు?

జిజిఎంపి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులకనుగుణంగా రూ.14.98 అంచనా వ్యయం కల్గిన 496 వర్క్స్ చేపట్టాము. వీటిలో ఎక్కువగా సిసి రోడ్లు, డ్రైన్లు చేపట్టాల్సి ఉంది.

ప్రశ్న: ఇప్పటి వరకు పూర్తి అయిన వర్క్స్ ఎన్ని? పేమెంట్ ఎంత వరకు జరిగాయి?

130 వర్క్స్‌కు సంబంధించి రూ. 4.95 కోట్ల మేరకు పేమెంట్స్ జరిగాయి. మరో 56 వర్క్స్‌కు సంబంధించిన బిల్స్ అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

ప్రశ్న: జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డిఎంఎఫ్‌టి) క్రింద చేపట్టాల్సిన వర్క్స్ ఎన్ని?

ఈ స్కీమ్ కింద జిల్లాలోని 60 గ్రామాల పరిధిలో 60 వర్క్స్ చేయాల్సి ఉంది. ప్రధానంగా రహదారులు, డ్రైయిన్లు, కమ్యూనిటీ హాల్స్ పూర్తి చేయాల్సి ఉంది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎన్ని వర్క్స్ కంప్లీట్ అయ్యాయి?

ఐదు వర్క్స్ కంప్లీట్ కాగా, మరో 21 ప్రోగ్రెస్‌లో, మరో 34 వర్క్స్‌ను ప్రారంభించాల్సి ఉంది. త్వరలో వీటిని ప్రారంభిస్తారు. ఈ వర్క్స్‌కు రూ. 15 కోట్ల వరకు నిధులు ఖర్చు అయ్యాయి.

సముద్ర స్నానాలకు పటిష్ట ఏర్పాట్లు : సిఐ

మాట్లాడుతున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ రమేష్

ప్రజాశక్తి-కోడూరు : సోమవారం జరిగే కార్తీక పౌర్ణమి సముద్ర స్నానాలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అవనిగడ్డ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ రమేష్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సముద్ర స్నానాల విధుల్లో పాల్గొనే పోలీస్ శాఖ సిబ్బందితో స్థానిక కోడూరు పోలీస్ స్టేషన్ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సముద్ర స్నానాలకు 10 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు, ఎక్కడా కూడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రధాన కూడళ్లలో పోలీస్ శాఖ సిబ్బందికి విధులు కేటాయించామని, పోలీస్ సిబ్బంది అంతా కూడా ఉదయం 4 గంటలకల్లా వారికి కేటాయించిన విధుల్లో వారందరూ కూడా హాజరు అవ్వాలని ఆయన తెలిపారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తులు పోలీస్ శాఖ సూచనలను పాటించాలని, ఎల్లప్పుడు పోలీస్ శాఖ సిబ్బంది మీకు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఉల్లిపాలెం భవానిపురం వారధి, కోడూరు ప్రధాన సెంటర్, హంసలదీవి గుడి, పాలకాయతిప్ప కరకట్ట, డాల్ఫిన్ భవనం, వంటి ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీస్ శాఖ సిబ్బందికి విధులు కేటాయించాలని, సముద్రం వెంబడి పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. అవనిగడ్డ, చల్లపల్లి, మచిలీపట్నం సబ్ డివిజన్ల నుంచి 5 గురు సబ్ ఇన్స్పెక్టర్లు, 100 మంది సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఈసమా వేశంలో కోడూరు నాగాయలంక, అవనిగడ్డ ఎస్సైలు, వి.రాజేంద్రప్రసాద్, ఎం సుబ్రహ్మణ్యం, జి.రమేష్ బాబు తోపాటు ఏఎస్ఐలు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని వాకర్స్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ రామలింగరాజు కీర్తించారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఏజీఅండ్ ఎస్ జీఎస్ కళాశాల ఆవరణలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వనసమా రాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ చేసిన సేవా కార్యక్రమాలను అధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు తెలియజేశారు. వనసమారాధన పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గౌరవ అధ్యక్షుడు నూకల సాంబశివరావు, జిల్లా అసిస్టెంట్ గవర్నర్ బాపిరాజు, సత్య కిషోర్, పాల్గొన్నారు. అసోసియేషన్ సలహాదారు చింత కోటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం వనసమారాధన ఆహ్లాదకరంగా నిర్వహించారు.

3న మానవత కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: ఆపద వేళ నేను ఉన్నానంటూ అండగా నిలుస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్ జంక్షన్ శాఖ నెలవారి సమావేశం ఏలూరు రోడ్ లోని మానవతా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో డిసెంబర్ 3న ప్రారంభించబోతున్న నూతన కార్యాలయ భవనం ఏర్పాట్ల గురించి చర్చిం చారు. కార్యాలయంలో ఫర్నిచర్ నిమిత్తం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మానవతా రాష్ట్ర కన్వీనర్ ,కృష్ణాజిల్లా సెంట్రల్ కమిటీ శాశ్వత చైర్మన్, హనుమాన్ జంక్షన్ శాఖ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు 1,11,111 లక్షల రూపాయలు విరాళాన్ని అందించారు. డిసెంబర్ మూడో తేదీన భవన ప్రారంభోత్సవము రోజు భోజనాల నిమిత్తం డైరెక్టర్ కొట్నాని రామచంద్ర రావు 5 వేల రూపాయలు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్ష కార్యదర్శులు సుబ్బాచారి, కళ్ళేపల్లి నారాయణరావు, ట్రజరర్ పాటిబోలు గణేష్ బాబు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం

చంద్ర కుటుంబానికి సాయం అందిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-వల్లపల్లి : జర్నలిస్టు కళ్లేపల్లి చంద్ర ఆత్మహత్య చేసుకొని మతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన కుటుంబానికి ప్రభుత్వ తోడ్పాటు అందిస్తామని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జర్నలిస్ట్ చంద్ర కుటుంబ సభ్యులను లక్ష్మీ ఫ్యామిలీ కుటుంబ సభ్యుల తో కలిసి బొప్పరాజు వెంకటేశ్వర్లు పరామర్శించారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏలూరు ఇంచార్జి డీపీఓ కళ్లేపల్లి చంద్రశేఖర్, గుడివాడ డి.ఎల్.పి.ఓ కళ్లేపల్లి కుసుమ కుమారి రూ.లక్ష 62,500లు ఆర్థిక సహాయాన్ని చంద్ర పిల్లలు హేమంత్ హరిణిలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వత్తి పట్ల అంకితభావంతో గత కొన్ని సంవత్సరాలుగా నియోజకవర్గంలో ఉత్తమ సేవలు అందిస్తున్న చంద్ర ఆకస్మిక మరణం పట్ల దిగ్భ్రాంతి చెందిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చంద్ర కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయం అన్నారు. చంద్ర భార్యకు ప్రభుత్వపరంగా ఏ విధమైన సహాయం అవసరమైనా అందించేందుకు తమ వంతు కషి చేస్తామని ప్రకటించారు. అవకాశం ఉంటే చంద్ర భార్యకు ప్రభుత్వ పరంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగం లభించే ఏర్పాటు కూడా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెంట్ గవర్నమెంట్ ప్రెస్, జనరల్ సెక్రెటరీ నాగవరపు శరత్ చంద్ర, రిటైర్డ్ ఎస్ఐ లంక రవీంద్ర, జేజే బిల్డింగ్ లిఫ్టింగ్ అండ్ షిఫ్టింగ్ కంపెనీ అధినేత కుడేటి సాయి శ్రీనివాస్, పాగోలు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డ సిటీ కేబుల్ జర్నలిస్ట్ కల్లేపల్లి చంద్ర కుటుంబానికి శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు రూ 5 వేల ఆర్థిక సహాయం అవనిగడ్డ ప్రెస్ క్లబ్ ద్వారా అందజేశారు. ఆదివారం సొసైటీ కార్యాలయం వద్ద ప్రెస్ క్లబ్ సభ్యులు కోట్ల సుబ్బారావు కేయూ గగారిన్, ఇమ్మడిశెట్టి రామారావులకు అందజేశారు.

రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యం : యార్లగడ్డ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: రాష్ట్రాభివద్ధితో పాటు సంక్షేమపథకాలు సకాలంలో అందాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందని టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇంచార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ,జనసేన సమన్వ యకర్త చలమలశెట్టి రమేష్‌బాబు అన్నారు. బందారుగూడెం, బొమ్ములూరు టీడీపీ గ్రామకమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బందారుగూడెంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబునాయు డు ప్రకటించిన సూపర్సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ రాష్ట్రాభివద్ధితో పాటు బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు నాయుడుకు మద్దతు ప్రకటించి టీడీపీని గెలిపించాలని యార్లగడ్డ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కొండేటి నాగరాజు, వేగే కష్ణారావు, మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, మూల్పూరి సాయికళ్యాణి, గుండపనేని ఉమావరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గన్నవరంలో...

ప్రజాశక్తి-ఘంటసాల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో టి.అనూహ్య అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామపంచాయతీ ప్రాంగణంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్ర మాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనూహ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 17 రకాల సంక్షేమ, అభివద్ధి పథకాలను అమలు చేస్తుందని వాటిని క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు భారత సంకల్పయాత్ర ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముందుగా భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఘనంగా నివాళులర్పించి ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని ఎంపీడీవో పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భూసార పరీక్ష పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం, అచ్చెమ్ పాలెం సర్పంచులు ముప్పనేని రవి ప్రసాద్, గాజుల శ్రీనివాసరావు, మండల పరిషత్ పరిపాలన అధికారి కేజే శ్రీనివాస చంద్, ఈవోపీఆర్డి జి కిషోర్, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.మురళీ కష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, ఏపీఎం బి.అమరేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, డాక్టర్ జె.అనిత, ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.మేరీ, కెవికె శాస్త్రవేత్త కె.రేవతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో సత్య కుమార్ అన్నారు. ఆదివారం గన్నవరం మండలం బుద్ధవరం పంచాయతీ కార్యాలయంలో విక్సిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. సత్య కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని చెప్పారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, సర్పంచ్ బడుగు బాలమ్మ, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, పంచాయితీ కార్యదర్శి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లైన్స్ సేవా భవనం నందు లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివహర్ష జ్ఞాపకార్థం 110 మంది నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం మరియు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి లైన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు మరియు లయన్ చాపరాల రాజేశ్వరరావు లయన్ సురపనేని పరంధామయ్య లయన్ చాపరాల బాలాజీ రీజనల్ చైర్మన్ లయన్ పి వి విజయ్ బాబు కోశాధికారి లయన్ పెరుమాళ్ కార్యదర్శి చలసాని శ్రీధర్ పాల్గొన్నారు.

కురియన్ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న చలసాని

ఘనంగా వర్గీస్ కురియన్ జయంతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్వేత విప్లవ పితామహులు డాక్టర్ వర్గీస్ కురియన్ 102వ జయంతి వేడుకలను కృష్ణా మిల్క్ యూనియన్ ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి ఆవరణలో గల కురియన్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ కురియన్ జయంతి సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలోని వెయ్యికి పైగా సహకార సంఘాలలో జయంతి వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధర చెల్లించటమే కాకుండా గత పది సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ధర వత్యాసం చెల్లిస్తూ పాడి రైతుల సర్వతోముఖాభివద్ధికి కషి చేస్తు దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు చలసాని చక్రపాణి, అర్జా వెంకట నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్ డ్యూటీ లేకుండా 'ఆడుదాం ఆంధ్ర' చేయలేం

ప్రజాశక్తి- గన్నవరం : రాష్ట్ర ప్రభుతం ప్రతిష్టాత్మకంగా తీసుకుని గామీణ ప్రాంతంలో కన్నుల పండుగ గా చేయాలని భావించిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరం ఆన్ డ్యూటీ లేకుండా విజయవంతం చేయలేమని గన్నవరం నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు తెలిపారు. రోజు రోజు కు పెరుగుతున్న పని ఒత్తిడి భారంగా మారిన పరిస్థితులలో ప్రతి సచివాలయం నుండి వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలంటే క్షేత్ర స్థాయికి వెళ్ళాలి, అందుకు గన్నవరం నియోజకవర్గం లో ప్రధాన ఉపాధ్యాయుల సహకారం లేక పోవడంతో అనుకున్న స్థాయి లో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొనలేక పోతున్నట్లు చెపుతున్నారని నాగరాజు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ ఉత్తర్వులు ఇప్పించి ఆడుదాం ఆంధ్ర విజయవంతం అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలోని పెనుముచ్చ గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన కొల్లూరు ప్రేమలతకి 13 వేల రూపాయలు సాయం అందజేసినట్లు గ్రామ సర్పంచ్ దండమూడి అచ్చిమాంబ తెలిపారు. దాతలు దండమూడి అచ్చి మామ సర్పంచ్ 3000 రూపాయలు, చెరుకూరు వెంకటేశ్వరరావు భార్య బేబీ సరోజినీ ఐదు వేల రూపాయలు ,చింతమనేని రాంబాబు 3 వేల రూపాయలు, పూర్ణచంద్రరావు 2000 రూపాయలు అందజేశారని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మొవ్వ రాము, మట్ట రాజశేఖర్, జుజ్జువరపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

ఫెర్టిలిటీ సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : భారతదేశంలోని అతిపెద్ద ఫెర్టిలిటీ చైన్ల హాస్పిటల్లో ఒకటైన నోవా ఇవిఎఫ్ ఫెర్టిలిటీ, ఏపీఆర్సీవోజీ ట్రస్ట్, విజయవాడ ఒబెస్ట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ సహకారంతో, వంధ్యత్వంతో పోరాడు తున్న జంటలకు ప్రయోజనం చేకూర్చేందుకు సహాయక పునరుత్పత్తి పద్ధతుల (అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నిక్స్)లో నూతన ప్రక్రియలు, అధ్యయనాలను అన్వేషించడానికి అంకితమైన సంతానోత్పత్తి సదస్సును నిర్వహించింది. నగరంలోని లెమన్ ట్రీ ప్రీమియర్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఫెర్టిలిటీ కాన్ఫరెన్స్‌లో భాగంగా జరిగిన సెషన్స్‌లో, నిపుణులు పదేపదే గర్భస్రావం కావడంలో జన్యుశాస్త్రం యొక్క పాత్ర, ఈ జంటలకు ప్రీఇంప్లాంటేషన్ జన్యు పరీక్ష వంటి పరీక్షలు ఎలా కీలకమో చర్చించారు. పురుషులలో వంధ్యత్వం, విటమిన్ డి, వంధ్యత్వంలో దాని ప్రాముఖ్యత, ఐవిఎఫ్ చికిత్సల్లో పురోగతి తదితర అంశాలను సైతం ఇక్కడ చర్చించారు. సదస్సులో విజయవాడలోని నోవా ఐవీఎఫ్ ఫెర్టిలిటీలో లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ వై.స్వప్న మాట్లాడుతూ పెరుగుతున్న వంధ్యత్వ సమస్యల గురించి మరింత మాట్లాడటం, అవగాహనను వ్యాప్తి చేయడం ఎంత ముఖ్యమో ఆమె వెల్లడించారు. విజయవాడలోని నోవా ఐవిఎఫ్ ఫెర్టిలిటీలో ఫెర్టిలిటీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీ లక్ష్మి అట్లూరి, ఈ సదస్సులో మాట్లాడుతూ జన్యు సమస్యల కారణంగా పదేపదే గర్భస్రావం అయ్యే రోగులలో ప్రీఇంప్లాంటేషన్ జెనెటిక్ టెస్టింగ్ వంటి పద్ధతులు ఉపయోగించబడతాయన్నారు.

వరల బుజ్జి మృతికి నివాళి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణ శాలివాహన సంఘ సభ్యులు, అందరికీ సుపరి చితుడు మర్రిపు డగల బుజ్జియ్య (62) అలియాస్ వరల బుజ్జి ఆదివారం తెల్లారుజామున మృతి చెందారు. కొంతకాలం నుండి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తిరువూరులోని తన నివాసంలో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు. సిమెంట్ పరికరాలు తయారీలో బుజ్జి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. సిపిఎం సీనియర్ నాయకులు గుళ్ళపల్లి వెంకటరత్నం, పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్, ఆకుల రవి, పంతంగి శ్రీనివాసరావు, కూరపాటి వెంకటరత్నం, పంమి లక్ష్మణరావు, ఎంఎల్ఎ పిఎ దద్దనాల రాంబాబు, వైసిపి నాయకులు పర్సా శ్రీనివాసరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు బొమ్మసాని మహేష్, శాలివాహన సంఘ నాయకులు జీడిమళ్ళ కాంతారావు, సోమవరపు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

పున్నమి ఘాట్‌లో జల్లు స్నానాలకు ఏర్పాట్లు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆంజనేయరెడ్డి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పవిత్ర కార్తీక పౌర్ణమి సోమ వారం సందర్భంగా భవానీ పురం పున్నమిఘాట్ కృష్ణా నదీ స్నానాలు ఆచరించే వారి కోసం జల్లు స్నానాల ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాలతో 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మరియు పోలీసు వారి సహకారంతో పున్నమి ఘాట్ మరియు భవాని ఘాట్ ప్రాంతాలలో ఘాట్లను శుభ్రం చేయించి స్నానాలు చేయటానికి వసతులు ఏర్పాటు పనులు చేపట్టారు. కార్తీక స్నానాలు చేసేందుకు వచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లను చేపట్టినట్లు కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డి తెలిపారు.

ముగిసిన పోస్టల్ ఉద్యోగుల ఆటల పోటీలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న జ్యోతి సురేఖ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 39వ ఆలిండియా పోస్టల్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రంతో ఉత్సాహభరితంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అర్జున అవార్డు గ్రహీత జ్యోతి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందచేశారు. మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ బంగారు పతకం సాధించింది. ఉద్యోగుల మధ్య పని ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అకౌంట్స్ డైరెక్టర్ వి.రోజ్‌మేరి, ఎం.జగదీష్ సాయి, పలువురు పోస్టల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎపి మత్తు వైద్య సంఘానికి ఐదు అవార్డులు

హర్యానా జాతీయ సదస్సులో ప్రదానం

అవార్డులు అందుకుంటున్న ఆంధ్రప్రదేశ్ మత్తు వైద్యులు, చిత్రంలో ఎపి రాష్ట్ర మత్తు వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీషియాలజీ 70వ వార్షిక సదస్సు హర్యానాలోని గురుగ్రామ్‌లో జరిగిందని ఇందులో రాష్ట్ర శాఖకు ఐదు అవార్డులు అందచేసినట్లు రాష్ట్ర మత్తు వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మత్తు వైద్యులకు సంబంధించి పలు కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంలో రాష్ట్ర శాఖ విశేష కృషి చేసిందని ఇంఉదలో భాగంగానే ఉత్తమ సంస్థగా అవార్డులను అందచేసినట్లు తెలిపారు. ఈ సదస్సుకు 5వేల మంది మత్తు వైద్యులు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రథమ బహుమతి లభించిందని నబెస్ట్ ఫెర్మార్మెన్స్‌కు డాక్టర్ ఆళ్ల ప్రశాంతికి ప్రెసిడెన్షియల్ అవార్డు లభించిందన్నారు. అలాగే వరల్డ్ అనస్తీషియా డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలకు రెండో జాతీయ అవార్డు లభించిందని స్టేట్ బెస్ట్ ఫెర్మార్మెన్స్ అవార్డును, వైజాగ్ సిటీ బ్రాంచ్‌కు బెస్ట్ అవార్డులు లభించాయని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ మత్తు వైద్యుల సంఘం చైర్మన్ డాక్టర్ చక్రారావు, పలువురు అభినందనలు తెలిపారన్నారు.

ఆఖరి మజిలీ సేవలకు శాంతిరథం అందించిన మానవత

వాహనాన్ని అందిస్తున్న దృశ్యం

విజయవాడ : మరణాంతరం భౌతిక దేహాలను స్మశాన వాటికకు తరలించేందుకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ వారు 8 లక్షల రూపాయల ఖర్చుతో రూపొందించిన శాంతిరథం (మహాప్రస్థానం)ను ఆదివారం ఉదయం లోక్ సభ పూర్వ సభ్యులు పారిశ్రామిక వేత్త గోకరాజు గంగరాజు చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక స్వాతంత్ర్య సమర యోధుల సంఘం భవన అవరణలో స్వర్గపురి కమిటీకి అందజేశారు. మానవత సంస్థ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ అధ్యాపకులు వల్లభనేని భానుమూర్తి, స్వర్గపురి కమిటీ కార్యదర్శి తిపిరినేని పార్థ సారథి మాట్లాడుతూ పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. మొబైల్ ఫోన్ల అతిగా వాడకం వల్ల అనర్థాలు వివరించారు. మానవత సంస్థ అధ్యక్షులు ఇమ్మానేని కష్ణ ప్రసాద్, కార్యదర్శి డి.సాంబశివరావు, కోశాధికారి పి రాము, ప్రతినిధులు చెరుకూరి బాబు, వేమూరు బాబురావు, యశోద, మోతుకూరి వెంకటేశ్వర రావు, నాదెళ్ల సుమతిదేవి, ఎమ్.వి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అప్పటి హెచ్ఎం చెరుకూరి వెంకటేశ్వరరావు, చిత్రంలో పలువురు ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ సమీపంలో గల తాడేపల్లి సీతానగరంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నగరంలోని హోటల్ శ్రీపాదలో ఘనంగా జరిగింది. పదో తరగతి 1976-77 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రైల్వేస్టేషన్ గాంధీనగర్‌లోని హోటల్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. 46 ఏళ్ల తర్వాత కలుసుకున్నామన్న ఆనందం పూర్వ విద్యార్థుల్లో కనిపించింది. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతూ తమ విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ గురువుల పట్ల ఉన్న భక్తిభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయులు చెరుకూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రకాశరావు, సురేంద్రబాబు, కామేశ్వరరావు, సుబ్బారావు, రామ్మూర్తి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి ఆరిగ స్వామి, పర్యవేక్షకులు ప్రతాపరెడ్డి, పూర్వ విద్యార్థులు రమణ, ఓ.రమేష్, కనకరాజు, దాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంస్య పతకాన్ని అందుకుంటున్న భారతి

భారతికి కాంస్య పతకం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఈ నెల 18 నుండి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన మొదటి కామన్‌వెల్త్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్‌లో నగరంలోని దామూస్ టిటి అకాడమి క్రీడాకారిణి పి.భారతి కాంస్య పతకం సాధించినట్లు అకాడమి కోచ్ వై.దామోదర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిసారిగా హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మన రాష్ట్రం నుండి పాల్గొన్న పి.భారతి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ పి.విశ్వనాథ్, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.బలరామ్ అభినందించారు.

దళిత స్వాభిమాన యాత్ర

ప్రజాశక్తి - విజయవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశతత్వాన్ని, అణిచివేత ధోరణి ముక్తకంఠంతో అన్ని ప్రజాసంఘాలు ఖండించాయి. సమతా సైనిక్ దళ్ (ఎస్-ఎస్‌డి) ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ హక్కుల పరిరక్షణ, నిధులు, పథకాల అవగాహన కోసం బాబాసాహేబ్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలకు వివరించడం కోసం దళిత స్వాభిమాన యాత్ర చెయ్యాలని నిర్ణయించారు. దళిత స్వాభిమాన బస్సుయాత్రను ఎస్‌సి, ఎస్‌టి, బిసి , మైనార్టీ ప్రజాసంఘాల, ఉద్యోగ సంఘాల నాయకుల చేతుల మీదుగా నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, ఎస్ఎస్‌డిరాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు అడ్వకేట్ పాలేటి మహేశ్వరరావు, ఎస్ఎస్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, ముస్లింమైనార్టీ హక్కుల రాష్ట్ర అధ్యక్షులు పరూక్ షుగ్లీ, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులుపేరుపోగు వెంకటేశ్వరరావు, జైభీమ్ పార్టీ నాయకులు పి.సురేష్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై ఘనంగా కోటి దీపోత్సవం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం, కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రదోష కాలంలో దీప ప్రజ్వలనతో కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం వీరు చిన్న రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన జ్వాళాతోరణం వద్ద ఆలయ వైదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, జ్వాలా తోరణం వెలిగించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కోటి దీపోత్సవం కార్యక్రమంలో యాత్రికులు విశేషంగా పాల్గొని, దీపాలు వెలిగించి శ్రీ అమ్మవారిని, స్వామివారిని దర్శనం చేసుకున్నారు.

కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.